# 15వ ఆర్థిక సంఘం నిధులపై ఆంక్షలు తొలగించాలి
## ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసిన సర్పంచుల నేతలు

- గ్రామపంచాయతీలకు స్వేచ్ఛగా నిధుల వినియోగానికి అనుమతించాలి



**అమరావతి, ఫిబ్రవరి 16 : గాయత్రి వార్తలు**
రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం ఎటువంటి ఆంక్షలు లేకుండా ఖర్చు చేసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని సర్పంచుల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం కరెంటు బకాయిలు, గ్రీన్ అంబాసిడర్ జీతాలు, చెత్త సేకరణ వంటి అంశాలకే ఖర్చు చేయాలన్న ఆదేశాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని శశిభూషణ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. అనేక మండలాల్లో సర్పంచులు ధర్నాలు చేపడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. గతంలో మాదిరిగానే గ్రామాలలో సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు, సైడ్ డ్రెయిన్స్, విద్యుత్ పరికరాల కొనుగోలు, మోటార్ రిపేర్లు వంటి అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించుకునేలా ఆదేశాలను సడలించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్స్ (ఎం-బుక్) రికార్డింగ్ కూడా పూర్తయినా బిల్లులు పాస్ కావడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు, కార్మికులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే గత నవంబర్, డిసెంబర్ నెలల్లో అప్లోడ్ చేసిన సాధారణ నిధుల బిల్లులు కూడా ఇప్పటికీ పాస్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో చర్చించారు. ఈ విషయాలపై స్పందించిన శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ, పెండింగ్ బిల్లులు పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్ పంచాయతీరాజ్ రికమండేషన్లను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా చిలకలపూడి పాపారావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ -- గ్రామపంచాయతీ తీర్మానం మేరకు సర్పంచులకు పూర్తి అధికారాలు ఉన్నాయని, గ్రామ ప్రజల అవసరాల కోసం ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోతే గ్రామస్థాయిలో తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహృదయంతో పునరాలోచించి, 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఆదేశాలు జారీ చేసి సర్పంచులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దశల వారీగా గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం:- ఎమ్మెల్యే భాష్యం

**పెదకూరపాడు ఫిబ్రవరి 16 గాయత్రి వార్తలు**






గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజల వద్దకు ప్రవీణ్ వంద రోజులు కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం సాయంకాలం కంభంపాడు గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మీరెవరు ఎమ్మెల్యే ఆఫీసుల చుట్టూ తిరగొద్దని, మీ గ్రామంలో మీ సమస్య వినేందుకు నేనే స్వయంగా వస్తున్న అని ఆయన అన్నారు. వంద రోజులు 100 గ్రామాలతో వచ్చిన విన్నపాలను పరిశీలించి విడతల వారీగా పరిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రతి సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లామని జరిగిన 20 నెలల పాలన అభివృద్ధి సంక్షేమం గురించి వివరించారు. జరగాల్సిన 24 నెలల్లో విడతల వారీగా ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చిన్న చిన్న విషయాలకు నాకోసం ఎదురుచూపులు చూడవద్దన్నారు. నేనే మీ వద్దకు వస్తా మీ సమస్య వింట అధికారులతో మాట్లాడతా విడతల వారీగా మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా అని భాష్యం ప్రవీణ్ ముక్తకంఠంతో సమావేశంలో అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్, గంగినేని లీలావతి మాదినేని సుబ్బయ్య, కృష్ణకుమారి, అత్తి మల్ల వెంకటేశ్వర్లు మాజీ ఎంపీటీసీ కృష్ణ దుప్పటి బాలకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

# భూమి ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి
## ప్రజా సంఘాల నాయకులు.

**నర్సరావు పేట: ఫిబ్రవరి-16 గాయత్రి వార్తలు**
అన్యాయంగా వ్యవసాయ భూమి ఆక్రమణకు యత్నిస్తూ బాధితులపైనే దాడికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని పిడిఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి సోమవారం డిమాండ్ చేశారు. పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాజుపాలెం మండలం పెద్ద నెమలిపురి గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య, గురువమ్మల కుటుంబానికి గ్రామంలోని సర్వేనెంబర్ 52-20-2సి లో 1-91 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని అదే గ్రామానికి చెందిన తెలికేపల్లి అంకారావు, శివయ్యలు ఆక్రమించుకోవాలని చూస్తూ హక్కుదారులైన శంకరయ్య కుటుంబీకులను గత కొన్నాళ్లుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కాగా తమ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలంటూ పల్నాడు జిల్లా కలెక్టర్ కు శంకరయ్య దంపతులు ఈ నెల 9వ తేదీన వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు రాజుపాలెం మండల సర్వే అధికారులు ఫిబ్రవరి 13న కొలతలు వేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో తమ పొలం వద్దకు వచ్చిన శంకరయ్య అతని కుమార్తె వెంకటలక్ష్మిలపై రెవెన్యూ అధికారులు ఎదుటే తెలికేపల్లి అంకారావు, శివయ్యలు దుర్భాషలాడుతూ దాడికి దిగారు. దీంతో భయభ్రాంతులకు గురైన తండ్రి, కుమార్తెలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీశారు. ఘటనపై బాధితులు పోలీసులు నాశ్రాయించి



ఫిర్యాదు చేశారు. అక్రమంగా భూమిని ఆక్రమించుకోవడానికి యత్నించడమే కాక దాడికి పాల్పడిన తేలికేపల్లి అంకారావు శివయ్యలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని, భూమికి హద్దులు నిర్ణయించి ఆక్రమణ గురికాకుండా చూడాలని . రెవెన్యూ, పోలీసు అధికారులను పిడిఏం జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్ వలి కోరారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు నరసరావుపేట పెద్ద చెరువులో జరిగిన కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వ్8.కోటా నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శీను నాయక్, పిడియం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, తోపాటుజి. రామకృష్ణ ,శ్రీను నాయక్,రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధికి తోడ్పాటు

**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి కి తొడ్పడే విదంగా ఉందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధ కృష్ణయ్య(చంటి) మీడియా ముఖంగా తెలియజేశారు. విద్యాశాఖ ఆరోగ్య శాఖలు అభివృద్ధికి పెద్ద పీట వేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం లో కి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలతో పాటు అభివృద్ధి కి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రతి చోట



హీరో ఉన్నప్పుడు విలన్ కుడా ఉంటాడు. అటువంటి విలన్ ఈ జగన్మోహన్ రెడ్డి. కాబట్టి సాక్షి పత్రికలో వస్తున్న ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్తలకు ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు ఏలూరు ఎమ్మెల్యే బడే రాధాకృష్ణయ్య తెలియజేశారు.

# తణుకులో"థాంక్యు లోకేష్" కార్యక్రమం





- లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థులు.
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో "థాంక్యు లోకేష్ కార్యక్రమం"
- మంత్రి లోకేష్ సారధ్యంలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి
- విద్యార్థుల జీవితంతో ఆడుకున్న జగన్మోహన్ రెడ్డి
- ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిన జగన్
- 20 నెలల కాలంలోనే రూ. 2800 కోట్లు చెల్లించిన, కూటమి
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి

**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడి వారి భవిష్యత్తును పణంగా పెట్టారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో పేద, మధ్య, దిగువ తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల వారి భవిష్యత్తుకు ఎన్నో ఆటంకాలు గలిగాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించేందుకు జీవో జారీ చేయడం పట్ల విద్యార్థులు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో కలిసి సోమవారం తణుకులో మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద, మధ్య, దిగువ తరగతి విద్యార్థులు, వారి చదువులకు ఆటంకం కలుగకూడదనే ఉద్దేశంతో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసిందని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి ఫీజు రియంబర్స్మెంట్ రూ. 4200 కోట్ల బకాయిలు జగన్మోహన్ రెడ్డి పెట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 20 నెలల కాలంలో రూ. 2800 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించారని చెప్పారు. ఈ నెలలోనే రూ. 1200 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి కేవలం బటన్ నొక్కుడు పిచ్చితో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టారని ఆరోపించారు.

# హర హర మహాదేవ్ నినాదాలతో నాలుగు వీధులు ఏకమై భక్తి పరవశం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(గాయత్రి వార్తలు ) రిపోర్టర్ : రంజిత్**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి రథోత్సవం అపూర్వ భక్తి పారవశ్యంతో అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు "హర హర మహాదేవ్", "ఓం నమఃశివాయ" నినాదాలతో నాలుగు వీధులు, నాలుగు దిక్కులు మారుమోగేలా శివనామస్మరణ చేశారు. ఆలయ పరిసరాలు భక్తిరసంతో నిండిపోయాయి. రథోత్సవంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొని తన ధర్మపత్నితో కలిసి రథాన్ని లాగి స్వామివారి కృపకు





పాత్రులయ్యారు. అలానే శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పాల్గొని శివనామస్మరణలు చేశారు, భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగుతూ ఆ వాయు లింగేశ్వరుని మహిమలను స్మరించుకున్నారు. శివశక్తుల సాక్షిగా సాగిన ఈ ఉత్సవం ఆధ్యాత్మిక ఉల్లాసాన్ని పంచింది. భక్తుల జైకారాలతో గగనమంతా మారుమ్రోగగా, ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో రథోత్సవం విజయవంతంగా ముగిసింది. శివయ్య కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై నిలిచి ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు ప్రార్థనలు చేశారు. ఈ రథోత్సవంలో శివ భక్తులు శ్రీకాళహస్తి ప్రజలు వేలాది మంది పాల్గొని నాలుగు వీధులు ఒక్కటయిందా అనేలా భక్తజనం సందోహంతో నిండిపోయింది

# బాల్ బ్యాడ్మింటన్‌కు ప్రభుత్వ మద్దతు – శాప్ చైర్మన్ రవి నాయుడు హామీ

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్**



ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. బాలాజీ, చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, క్రాంతి కుమార్‌లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అవసరమైన సదుపాయాలు, శిక్షణా కార్యక్రమాలు, పోటీలు నిర్వహణకు ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడను గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రతిపాదించారు. దీనికి స్పందించిన శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు కూడా తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు కి ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆస్థి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి
- మండలానికి రోజుకు రూ.10 లక్షలు లక్ష్యం చేసుకుని సాదించాలి
- యూనిఫైడ్ ఫామిలీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి
- పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేయాలి
- రానున్న 10 రోజులు పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి లక్ష్యాలను సాదించాలి

**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**




జిల్లాలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి సోమవారం సాయంత్రం ఆస్థి పన్నులు వసూళ్ళు, పీ4, యూనిఫైడ్ ఫామిలీ సర్వే, తదితర అంశాలపై ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పన్నుల వసూళ్లు బకాయిలు పేరుకుపోవడంపై అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిర్ణీత గడువులోగా పన్నులు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఆస్థి, తదితర పన్నులు బకాయిలతో సహా వసూలుకు చర్యలు తీసుకోవాలని, ప్రతీ మండలంలో రోజుకు 10 లక్షల రూపాయలు పన్నుల వసూళ్లను లక్ష్యంగా నిర్ణయించుకుని ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు. రానున్న 10 రోజులు పంచాయతీ, పురపాలక సంఘాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణీత లక్ష్యాలను సాధించాలన్నారు. యూనిఫైడ్ ఫామిలీ సర్వే ని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి నిర్దేశించిన రోజూ వారీ లక్షయాల మేర సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేయాలని, జిల్లాలో 71 వేల 910 బంగారు కుటుంబాలకుగాను, ఇంతవరకు 24 వేల 268 కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేయడం జరిగిందని, మిగిలిన 47 వేల 642 కుటుంబాలకు సంబంధించి మార్గదర్శులను గుర్తించి త్వరితగతిన అనుసంధానం చేయాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ, ఎంపిడిఓ లు, నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల కమిషనర్లు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శించిన టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : రంజిత్**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం దంపతులు శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, పాలకమండలి సభ్యులు కొప్పర్ల నాగరాజు, తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, శ్రీకాళహస్తి నాయి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ డి. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- జీలుగుమిల్లి అంగన్ వాడి కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్**

జీలుగుమిల్లి మండలం చంద్రమ్మ కాలనీ లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

సోమవారం ఉదయం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందిస్తున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు అందుతున్న సేవలు, హాజరు నమోదులు, స్టాక్ రిజిస్టర్లు, మౌలిక సదుపాయాల పరిస్థితిని స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, పిల్లల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. గర్భిణీలు, బాలింతలు సమయానికి పోషకాహారం



తీసుకోవడం అత్యంత అవసరమని తెలియజేశారు. కేంద్రంలో తాగునీరు, పరిసరాలశుభ్రత, మరుగుదొడ్లు, వంటగది నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మత్తులు, సామగ్రి కొరత ఉంటే వెంటనే నివేదించాలని తెలిపారు. ప్రభుత్వం చిన్నారుల పోషణ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని, అంగన్వాడీ కేంద్రాలు గ్రామ స్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కేంద్రం సమర్థవంతంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# బ్రహ్మముహూర్తంలో మహాదేవునికి మహాపూజలు

**తొట్టంబేడు, ఫిబ్రవరి 16,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్**



తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి పంచాయితీ కొత్త కన్నలి గ్రామంలో శ్రీ సద్గురు దత్తాత్రేయ స్వామి మందిర నిర్మాణ స్థలంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ నర్మదేశ్వర మహాదేవుని సాన్నిధ్యంలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం నిర్వహించడం జరిగింది. శ్రీ సద్గురు దత్తానంద్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6:30 గంటలకు,రాత్రి 11:30 గంటలకు,సోమవారం బ్రహ్మ ముహూర్తం నాలుగు గంటలకు శ్రీ నర్మదేశ్వర మహాదేవునికి అభిషేకాలు,హోమాలు, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి రథోత్సవంలో చంద్రప్ప సేవా స్ఫూర్తి భక్తులకు మజ్జిగ పంపిణీ

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు, ఫిబ్రవరి 16: రిపోర్టర్ : మునిరత్నం**

శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఈరోజు ఘనంగా నిర్వహించిన రథోత్సవంలో భాగంగా, భారతీయ జీవన పరివర్తనం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ చంద్రప్ప గారు భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా "భారతీయ జీవన పరివర్తనం చారిటబుల్ ట్రస్ట్" ను స్థాపించినట్లు తెలిపారు. వేల



సంవత్సరాలుగా భారతదేశం సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ, ప్రపంచానికి మార్గదర్శకంగా గురు స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. విదేశీ పరిపాలన కాలంలో మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు కొంత మేరకు దెబ్బతిన్నాయని, ప్రజలు ఇతర సంస్కృతుల ప్రభావంలోకి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం మళ్లీ భారతీయ సంప్రదాయాలు, ధర్మం, సంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, విజ్ఞానం, సంస్కృతి, సాహసం, ఆధ్యాత్మికత వంటి అన్ని రంగాల్లో భారతదేశం మళ్లీ ప్రపంచానికి గురువుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. సనాతన ధర్మ విలువలను కాపాడుకుంటూ, యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించడమే తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడతామని చంద్రప్ప గారు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కంద్రిగ ఉమా , ప్రమీలమ్మ , పిల్లారీ బత్తినయ్య, మ్యాగీ క్లారా, తరుణ్, జస్వంత్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# రథోత్సవంలో భక్తులకు మజ్జిగ పంపిణీ

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : రంజిత్**



మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య కన్నులపండువగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రథోత్సవానికి హాజరైన భక్తులకు గ్రాండ్ ఆప్టికల్స్‌కు చెందిన కుమార్ మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు శీతలపానీయం అందజేస్తూ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల శివకుమార్, చంగల్పట్టు మునికుమార్, హరి, చక్రాల సురేంద్ర, కోట చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండ లో మద్యం అమ్ముతున్న హోమ్ గార్డ్

**గాయత్రి వార్తలు**



కోటప్పకొండ తిరునాళ్ళలో నేరుగా పోలీస్ హోంగార్డు మద్యం అమ్ముతున్న పరిస్థితి నెలకొంది.. తిరునాళ్ళ విధులు గాలికి వదిలేసి మద్యం వ్యాపారంలో కోటి అనే హోం గార్డ్ నిమగ్నమయ్యారు .మూడురోజుల పాటు కోటప్పకొండ పరిసర ప్రాంతాలలో మద్యం అమ్మకాలు కలెక్టర్ నిషేధించారు ..నేరుగా పోలీసులే మద్యం అమ్ముతున్న వైనం చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు హోంగార్డు కోటిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు సమీప గ్రామ ప్రజలు కోరారు.

# యూటీఎఫ్ ఆధ్వర్యంలో రథోత్సవ భక్తులకు అన్నదానం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(గాయత్రి వార్తలు )రిపోర్టర్ : రంజిత్**



మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామి అమ్మవార్ల రథోత్సవం సందర్భంగా భక్తులకు యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తుల ఆకలి, దప్పికలను తీర్చడం ఆనందంగా ఉందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మోహన్ బాబు తెలిపారు. ప్రతి సంవత్సరం రథోత్సవం రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోందని, భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వయ్యాల మధు, డివిజనల్ కన్వీనర్ వెంకట కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు హేమాంబరధర రావు, వై. విజయశ్రీ, రాష్ట్ర కౌన్సిలర్ ప్రభావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్.బి. సూర్యప్రకాశ్, జి. శ్రీనివాసులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.